టెర్రర్

పూర్ణామార్కెట్ తర్వాత అంతటి పేరున్న రామకృష్ణా రైతుబజార్‌కు జిల్లా నలుమూలల నుంచి వ్యాపారులు తమ సరకులతో విక్రయాల కోసం వస్తారు. కొనుగోలుదారులు కూడా అలాగే ఈ బజారుకు పెద్ద సంఖ్యలో విచ్చేస్తారు. ఈ కారణంగా ప్రతిరోజూ వేకువ జామునే ఈ ప్రాంతం విపరీతమైన రద్దీతో కిటకిటలాడుతుంటుంది. అలాగే జ్ఞానాపురం, పూర్ణామార్కెట్, పోర్టు, పాతనగరానికి వెళ్లేందుకు ఇక్కడి రోడ్డే ఆధారం కావడంతో వాహనాల రద్దీ కూడా ఇక్కడ ఎక్కువే. దీంతో ఈ బజార్ రోడ్డు ఎప్పుడు చూసినా జనం, వాహనాలతో కిక్కిరిసి ఉంటుంది. దీంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి.. సీసీ కెమెరాలు అమరిస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఇక్కడి వ్యాపారులు, వినియోగదారులు అధికారులను కోరుతున్నారు.

- రామకృష్ణా రైతుబజార్ వద్ద తరచూ ప్రమాదాలు
- స్పీడ్‌బ్రేకర్లు, సీసీ కెమెరాలు లేకపోవటమే కారణమంటున్న వ్యాపారులు, వినియోగదారులు


స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్స్ లేని పోర్టు రైలుమార్గం


రామకృష్ణా రైతుబజార్ సమీపంలోని హార్బర్ పోలీసు స్టేషన్ వద్ద శిథిలమైన స్పీడ్‌బ్రేకర్లు

తీసుకోవల్సిన చర్యలు..

రామకృష్ణా రైతుబజార్ మూడు రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలి. అలాగే ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. వాహనాలు వేగంగా వెళ్లకుండా స్పీడ్ లిమిట్ పెట్టి ప్రమాదాలను అరికట్టాలి. వ్యాపారులు రహదారి పక్కన విక్రయాలు జరపకుండా రోడ్డు దిగువన ప్లాట్‌ఫామ్ వెనుక తమ కార్యకలాపాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలి.

జగదాంబ : రామకృష్ణా రైతుబజార్ వద్ద ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డులో ఉన్న ఈ రైతుబజార్ వద్ద మూడు రోడ్ల జంక్షన్ ఉంది. ప్రధాన రోడ్ల మీద కిక్కిరిసిన ట్రాఫిక్ నుంచి తప్పించుకునేందుకు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహన చోదకులంతా ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ జ్ఞానాపురం, పూర్ణామార్కెట్, పోర్టు, పాతగనగరానికి వెళ్లేందుకు వీలుగా ఉన్న మూడు రహదారుల జంక్షన్ ఉంది. ఇది ఎప్పుడూ విపరీతమైన రద్దీతో ఉంటుంది. అలాగే ఇక్కడే రామకృష్ణా రైతుబజార్ కూడా ఉండడంతో రోజూ ఇక్కడికి వివిధ గ్రామాల నుంచి ఉదయం అయిదు గంటలకే రైతులు వారు పండించిన పంట అమ్మకాల కోసం వందల సంఖ్యలో వస్తుంటారు. ఈ విధంగా ఈ జంక్షన్ ఎప్పుడూ కోలాహలంగానే ఉంటుంది. దీని వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని అటు వ్యాపారులు, ఇటు కొనుగోలు దారులు భయపడుతుంటారు.


రామకృష్ణా రైతుబజార్ వద్ద ట్రాఫిక్ జామ్‌తో వాహన చోదకులు, పాదచారుల ఇక్కట్లు

నిత్యం ప్రమాదాలే..

రామకృష్ణా రైతుబజార్ జంక్షన్‌లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటూ ఉంటాయి. గతంలో ఇక్కడ ఓ మహిళను బస్సు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అంతే కాకుండా ఇటీవల మరో మహిళ తాను పండించిన కూరగాయలు విక్రయానికి తీసుకొచ్చి బస్సు దిగుతుండగా ప్రమాదానికి గురై కాలు విరిగి ఆస్పత్రి పాలైంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఇక్కడ ఎన్నో ప్రమాదాలు జరిగాయి.

కారణాలు ఇవే..

నిత్యం ప్రమాదాలు జరుగుతున్న రామకృష్ణా రైతుబజార్ మూడు రోడ్లలో ప్రమాదాలకు కారణం ఈ ప్రాంతంలో ఎక్కడా ఒక్క స్పీడ్ బ్రేకర్ కూడా లేకపోవడమే. దీంతో వాహన చోదకులు ఎక్కడా ఆగకుండా వేగంగా దూసుకొస్తూ ఉంటారు. ఆ కారణంగా ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే ఇక్కడ సీసీ కెమెరాలు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమని చెప్పాల్సి ఉంటుంది. సీసీ కెమెరాలు ఉంటే వాహనాలు వేగంగా నడిపేందుకు ఆకతాయిలు ఒకింత జడుస్తారు. అటువంటి ఏర్పాటు లేకపోవడం వల్ల ఇష్టమొచ్చినట్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. అడిగే నాథుడు లేకపోవడంతో నిత్యం నరకం చూస్తున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి ..



రామకృష్ణా రైతుబజార్‌కు వచ్చే వ్యాపారులు, వినియోగదారులు అందరూ భయం భయంగానే రోజువారీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి రద్దీ వల్ల ఏ రోజు ఎవరికేం జరుగుతుందో తెలియడం లేదు. అధికారులు ప్రమాదాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలి.
– నాయుని సూర్యనారాయణ, రైతుబజార్ ప్రెసిడెంట్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..



గతంలో ఈ మార్కెట్ వద్ద పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే ఓ లారీ సీసీ కెమెరాలున్న స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభంతో పాటు కెమెరాలు కూడా శిథిలమైపోయాయి. అప్పటి నుంచి మళ్లీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. కెమెరాలుంటే ప్రమాదాల నివారణతో పాటు రైతుబజార్‌లో దొంగల భయం కూడా తగ్గుతుంది.
– అరుణ్, వినియోగదారుడు, బౌడారా రోడ్డు

బొత్సకు అభినందనలు


బొత్సను అభినందిస్తున్న ద్రోణంరాజు శ్రీ వత్సవ్ తదితరులు

మహారాణిపేట : ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బొత్స స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో వుడా మాజీ చైర్మన్ సీఎస్ఎన్ రాజు, మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు, జెడ్పీటీసీ సభ్యుడు దొండా కన్నబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బొత్సను కలిసిన నాయకులు


బొత్సకు అభినందనలు తెలియజేస్తున్న బొడ్డేటి ప్రసాద్ తదితరులు

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ తరఫున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయిన బొత్స సత్యనారాయణను 33వ వార్డు నాయకుడు బొడ్డేటి ప్రసాద్, కోరిబిల్లి త్రినాథ్, శరగడం మోహన్‌రావు, కొడమంచిలి శ్రీను తదితరులు ఆదివారం అతని గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ గంకల కవిత పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. వర్షాలు కురిస్తే పనులకు ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆమె కోరారు. అనంతరం వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

14వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

డాబాగార్డెన్స్ : శ్రావణమాసం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు ఆదివారం 14వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మీ పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు విశిష్ట శ్రావణ లక్ష్మీ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారి విజయమ్మ

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం శ్రావణ శుద్ధ చతుర్దశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించి, హారతి పూజలు చేశారు. అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల వసతులను ఈవో సురేష్‌బాబా పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వాసికి ఆశ్రయం



నిరాశ్రయుల వసతి గృహానికి చేరుకున్న చొప్పల రాము

సీతమ్మధార : ఆరోగ్యం బాగు లేని వ్యక్తికి ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. వివరాలిలా ఉన్నాయి. ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ప్రగడ వాసుకు శ్రీకాకుళానికి చెందిన చొప్పలరాము (55) అనారోగ్యంతో బాధపడుతూ కనిపించాడు. వివరాలు సేకరించగా భార్యాపిల్లలు ఉండి కూడా అతను ఒంటరి వాడయ్యాడు. అతను కాలి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. ఆయనను ద్వారకా నగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు.

దశావతార విగ్రహాల ప్రతిష్ట

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం దశావతార విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, నరసింహ, వామావతారం, మత్స్యావతారం, వరాహావతారం, పరుశరామ, కూర్మావతార, బుద్ధావతారం, కల్కి అవతారం విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జీఎం పి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, అర్చకులు మనోజ్ స్వామి, హరినా రాయణ స్వామిలు దశావతార విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విగ్రహాల దాతలు, వారి కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళారంగ ప్రముఖులు

డాబాగార్డెన్స్ : స్వరమాలిక సంగీత సంస్థ అధ్యక్షుడు గిన్నె ఆంజనేయరెడ్డి నేతృత్వంలో ఆదివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'నా మదిలో నీవే ఉంటే' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ముందుగా స్టేట్ సోషల్ మీడియా చైర్మన్ సన్‌మూర్తి, కళాకారుల సంఘం కార్యదర్శి చెన్నా తిరుమలరావు, రంగారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయకులు కృష్ణంరాజు, పోతురాజు, శ్రీనివాస్, ఏవీఎస్ రెడ్డి, శైలజ, గుణశ్రీ, పూర్ణిమ, మాధురి, సుజాత, సావిత్రి, నర్సింగ్, రాంబాబు, అప్పారావు తదితరులు ప్రజాదరణ పొందిన చిత్ర గీతాలు ఆలపించారు. కీబోర్డ్‌పై సోమేశ్, తబలాపై ధనుంజయ్, అప్పలరాజు, ప్యాడ్స్‌పై బాబ్జి చక్కని సంగీతాన్ని అందివ్వగా లక్ష్మీ స్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

రాఖీ సందడి


సందడిగా మారిన స్వీట్ షాపు


అల్లిపురంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు

అల్లిపురం : రాఖీ పండగ నేపథ్యంలో ఆదివారం పలు కూడళ్లలో రాఖీ దుఖాణాల వద్ద సందడి నెలకొంది. ఈ ఏడాది కొత్త కొత్త రకాల రాఖీలు రావటంతో వాటిని కొనుగోలు చేసేందుకు యువత పోటీ పడ్డారు. రంగు రంగుల రాఖీలను ధరతో నిమిత్తం లేకుండా కొనుగోలు చేస్తున్నారు. మిఠాయిలు కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్ద మహిళలు సందడి చేస్తున్నారు. సోదరీమణులు రాఖీ కడితే, వారికి బహుమతులు ఇచ్చేందుకు సోదరులు అదే స్థాయిలో బిజీబిజీగా ఉన్నారు. అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు సూచనగా రాఖీ పండగ జరుపుకునేందుకు అక్కచెల్లెళ్లు సిద్ధమవుతున్నారు.

జూలో రెడ్ నెక్డ్ వాల్లబీ సందడి


యానిమల్ కీపర్‌కు దూరంగా పరిగెడుతున్న రెడ్ నెక్డ్ వాల్లబీ

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. వన్యప్రాణులు ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ కనువిందు చేశాయి. ఇక్కడ రెడ్ నెక్డ్ వాల్లబీ ఎన్‌క్లోజర్‌లో గంతులు వేస్తూ.. అటూ ఇటూ పరిగెడుతూ సందర్శకులను మరింతగా ఆకట్టుకుంది. ఇటీవల గుజరాత్ జూ నుంచి ఒక జత రెడ్ నెక్డ్ వాల్లబీని జూ అధికారులు ఇక్కడికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వాటి కోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్‌ను సిద్ధం చేశారు. దానిలో ఆదివారం యానిమల్ కీపర్ ఆహారం(పచ్చని ఆకులు) అందించే సమయంలో వాల్లబీలు పరుగులు తీశాయి. యానిమల్ కీపర్‌కు దూరంగా ఎన్‌క్లోజర్ లోపల అమర్చిన దుంగల మీదుగా ఎగురుతూ పరిగెడుతూ సందడి చేశాయి.

ఒకటి నుంచి ఏఐటీయూసీ సమితి సమావేశాలు


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మురళీనగర్ : విశాఖ నగరంలో సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలకు ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం 48వ నంబరు బస్టాప్ వద్ద గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ పెద్దలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ వారితో పోరాడి కార్మిక వర్గం సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై భవిష్యత్ పోరాట కార్యాచరణను ఈ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.గోపాలం, జిల్లా సమితి సభ్యుడు ఎస్.నాగభూషణరావు పాల్గొన్నారు.

నేటి తరం నటులకు చిరంజీవి ఆదర్శం


కంచర్లను సత్కరిస్తున్న కళా సంస్థల ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : నేటి తరం నటులకు చిరంజీవి ఆదర్శప్రాయుడని సినీ నిర్మాత, ఉపకార్ ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం చిరంజీవి కళా పరిషత్ నేతృత్వంలో నిర్వహించిన చిరంజీవి జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పద్మ విభూషణ్ డాక్టర్ చిరంజీవి జీవిత చరిత్ర ఆధారంగా మెగా స్టార్ బయోపిక్ నిర్మిస్తానన్నారు. ఉపకార్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్న కంచర్లను 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అభినందించారు. అనంతరం కంచర్లను కళా సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు సత్కరించారు. కార్యక్రమంలో గంటి మురళి, కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, ఉపకార్ కన్వీనర్ సుధీర్, కె. లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట ప్రధాన రహదారిపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇదే రోడ్డు మీదుగా రాకపోకలు చేసే వారికి ఇబ్బంది మారింది. ఈ రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు వెలిశాయి. వాటికి తోడు తోపుడుబండ్లపై టిఫిన్ దుకాణాలు పెట్టారు. ఈ దుకాణాల వద్దకు వచ్చే వారు వారి వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి టిఫిన్ షాపు వద్ద ఉదయం వేళల్లో ద్విచక్ర వాహనాలను ఇరువైపులా పార్క్‌చేస్తున్నారు. దీంతో ఈ సమయంలో వాహనాల రాకపోకలకు వీలు లేక ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. ఈ రోడ్డు అటు ఇసుకతోట జాతీయ రహదారి నుంచి, ఇటు కృష్ణా కళాశాల, హెచ్‌బీ కాలనీ వైపు రాకపోకలు చేసే వాహనాలతో రద్దీగా ఉంటుంది. టూ వీలర్లతో పాటు కార్లు, ఆటోలను సైతం ఈ రోడ్డుపైనే నిలిపి వేయడంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

జేసీఐ విశాఖ అచీవర్స్ సెమినార్


సెమినార్‌లో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : నగరంలోని ఓ హోటల్లో జేసీఐ విశాఖ అచీవర్స్ నేతృత్వంలో ఆదివారం ఓరియంటేషన్ సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ జోన్ ప్రెసిడెంట్ సురేష్ గొంప పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేసీఐ విశాఖ చాప్టర్ పరిధిలో పని చేస్తున్న పలు సంఘాల ప్రతినిధులు సేవలు ఏ విధంగా గుర్తించాలి? అవార్డులకు ఎలా ఎంపిక చేయాలనే విషయాన్ని సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ జెడ్ డి. రూప సిరిపూరి, జేసీఐ వైస్ ప్రెసిడెంట్ అనురాధ్ సిస్టలా, జోనల్ చైర్‌పర్సన్ సింధూర తాడి, ప్రాజెక్టు డైరెక్టర్ సోమశేఖర్, బి. దిలీప్‌కుమార్, రంజిత్ షా, డాక్టర్ శీతల్ మదన్, ఉమా, శ్రీదేవి, విజయ కిరణ్, పర్వీన్, చంద్రశేఖర్, ప్రేరణ మదన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్ : పాతనగరంలో గల ఆర్య వైశ్య యువజన సంఘం 2024–25 ఏడాదికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం సంఘ భవనం వాసవీ భవన్‌లో నిర్వహించారు. ప్రస్తుత అధ్యక్షుడు నల్లూరి నూకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 2024–25 ఏడాదికి గాను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దుర్గా సోమేశ్వరరావు, కార్యదర్శి కె. రామారావు, కోశాధికారి పీవీఎస్ఎస్‌వీ సాంబమూర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలు కంకటాల శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పాలూరి ప్రసాద్, కట్టమూరి ప్రసన్న, సహాయ కార్యదర్శులుగా జి. శ్రీనివాస్, పీఎస్ఆర్ కిషోర్, కట్టమూరి సూర్యనారాయణతో పాటు ఉద్యోగ, వ్యాపార విభాగాలకు సంబంధించి 40 మంది కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వ్యాపారవేత్త గ్రంధి రాంజీ మాట్లాడుతూ 50 ఏళ్ల కిందట విశాఖలో ఆర్యవైశ్యుల అభ్యున్నతికి, పేద వైశ్యులకు అన్ని విధాల చేయూతనివ్వాలని సంఘాన్ని స్థాపించారన్నారు. నాటి నుంచి ఇప్పటి వరకు అదే స్ఫూర్తితో సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విన్నకోట రామమూర్తి, డాక్టర్ పుప్పల భాస్కరరావు, వంకాయల బాబ్జి, కొల్లూరు రాము, పట్నాల వెంకటరెడ్డి, గ్రంథి రామకృష్ణారావు, కందుల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటున్న అంజలి తదితరులు

డాబాగార్డెన్స్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఆదివారం నగరంలోని పంజాబ్ హోటల్ జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్ దేశంలో కెమెరాని అభివృద్ధి చేసి ప్రపంచానికి పరిచయం చేసింది లూయిస్ డాగురే అని విశాఖలో ఫొటోగ్రాఫర్‌గా జీవిస్తున్న అంజలి తెలిపారు. ఎక్కడ ఏం జరిగినా ప్రపంచానికి క్షణాల్లో తెలియజేసే జర్నలిస్టులు, ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్లు ఈ వృత్తిలో రాణిస్తున్నారన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా ఫొటోగ్రాఫర్‌గా, ఆల్బమ్ డిజైనర్‌గా, వీడియో ఎడిటర్‌గా ఫొటో స్టూడియో నిర్వహిస్తూ ఎంతో మంది మహిళలు, పురుషులకు శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు


ఏఈవో నరసింగరావుకి చెక్కు అందజేస్తున్న మహంతి వెంకటలక్ష్మి ప్రతినిధులు


సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్కు అందజేస్తున్న చెక్క రాజు, ప్రసాద్

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం సింహాచలం దరి ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన మహంతి వెంకటలక్ష్మి లక్ష 116 రూపాయాల విరాళాన్ని, డాబాగార్డెన్స్‌కి చెందిన చెక్కరాజు, ప్రసాద్ కలిసి లక్ష 116 రూపాయల విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాలను అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావుకి, ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్కుల రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతల కుటుంబాలకు దేవస్థానం అధికారులు దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

కోల్‌కత్తా ఘటనపై ఐద్వా నిరసన

పరవాడ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అతి కిరాతకంగా అత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. కోల్‌కత్తా ఘటనకు నిరసనగా ఐద్వా సభ్యులు గొర్లివానిపాలెం వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. కిరాతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.